

చెస్ టోర్నీ విజేత దుర్గాప్రసాద్

ధర్మవరంలో రెండు రోజులుగా జరుగుతున్న 7వ రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ ఆదివారం ముగిసింది. ధర్మవరానికి చెందిన దుర్గాప్రసాద్ విజేతగా నిలిచాడు. 8లో



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్టంగా రూ.13 మేర ధర పలికింది. మార్కెట్‌కు 600 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం
34.8°/14.1°

జిల్లా పరిధిలో ఆదివారం చలి వాతావరణం నెలకొంది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు మడకశిరలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- హాజరు కానున్న కలెక్టర్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్

మడకశిర: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కరుణాకర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఆర్డీఓ ఆనందకుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. పెనుకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించుకోవచ్చన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రశాంతి నిలయం: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ హాలులో ఉంటుందని డీఆర్‌ఓ విజయ సారథి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీలను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమర్పించవచ్చన్నారు.

నేటి నుంచి ఇంటర్ జనరల్ ప్రాక్టికల్స్



రఘునాథరెడ్డి

పుట్టపర్తి: ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు సోమవారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లా నుంచి 5,749 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరు కానుండగా, వీరి కోసం 47 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘునాథరెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. రోజూ రెండుపూటల ప్రాక్టికల్స్ ఉంటాయని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగుతాయన్నారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో..

ప్రతి కేంద్రంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు రఘునాథరెడ్డి తెలిపారు. విద్యార్థులు ప్రయోగాలు చేసే సమయంలో ఎగ్జామినర్, చీఫ్ సూపరింటెండెంట్ తప్ప తక్కిన ఎవరూ ఉండకూడదన్నారు. మార్కుల నమోదులో పారదర్శకంగా వ్యవహరించాలని, ఏ చిన్న పొరబాటు జరిగినా సంబంధిత ఎగ్జామినరే బాధ్యత వహించాల్సి ఉంటుందని రఘునాథరెడ్డి హెచ్చరించారు.

నేడు కలెక్టరేట్‌లో మద్యం దుకాణాలకు లాటరీ

పుట్టపర్తి టౌన్: ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు జిల్లాలో 9 దుకాణాలు కేటాయించగా, దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఇప్పటికే కల్లుగీత కార్మికుల్లోని ఉపకులాలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో దుకాణాలు కేటాయిస్తూ ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. దరఖాస్తు గడువు ఆదివారంతో ముగియగా, మొత్తంగా 59 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సోమవారం కలెక్టర్ టీఎస్ చేతన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో లాటరీ తీసి దుకాణాలు కేటాయించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 8 గంటలకు నుంచి 9 గంటల్లోపు దరఖాస్తుదారులు ఎంట్రీ పాసుతో పాటు గుర్తింపు కార్డుతో లాటరీ నిర్వహణ ప్రాంతానికి చేరుకోవాల్సి ఉంటుంది.

కాసుల కోసం

కక్కుర్తి పరీక్ష!



- హిందూపురంలోని రహమత్‌పురం ప్రాంతానికి చెందిన షాహిద్ కొంతకాలంగా మధుమేహంతో బాధపడుతున్నాడు. రెగ్యులర్ చెకప్‌లో భాగంగా హిందూపురంలోని ఓ ప్రైవేటు ల్యాబ్‌కు వెళ్లి రక్త నమూనాలు ఇచ్చాడు. షుగర్ లెవల్స్ సాధారణం కంటే అధికంగా (400 ఎంజీ/డీఎల్) ఉన్నట్లు రిపోర్టు ఇచ్చారు. అది తీసుకుని వైద్యుడి వద్దకు వెళ్తే ఆయన ఇన్సులిన్ మందులు రాసిచ్చాడు. అనుమానం వచ్చిన షాహిద్... పక్కనే ఉన్న మరో డయాగ్నస్టిక్ సెంటర్‌కు వెళ్లి మరోసారి చెక్ చేయించుకున్నాడు. అందులో షుగర్ లెవల్స్ 200 ఎంజీ/డీఎల్ ఉన్నట్లు నిర్ధారణ కావడం విశేషం.

- పుట్టపర్తి నుంచి ఓ మహిళ ఉదయాన్నే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో హిందూపురం వెళ్తోంది. ఆమె ఫోన్‌లో మాట్లాడుతూ.. 'హిందూపురం వెళ్తున్నాను. ముందు పాప కదా.. ఈసారి కూడా మూడో నెల. అందుకే స్కానింగ్ కోసం వెళ్తున్నా. అక్కడ వేరే అన్న రమ్మని చెప్పాడు. రైల్వే స్టేషన్‌లో దిగితే వచ్చి తీసుకెళ్తారు. మొత్తం రూ.8 వేలు ఫీజు చెప్పారు. ఎవరికీ చెప్పొద్దన్నారు. మీ వాళ్లు ఎవరైనా ఉంటే చెప్పు. స్కానింగ్ చేయిద్దాం. సరే ఉంటా.. టీసీ వస్తున్నాడు..' అంటూ ఫోన్ కట్ చేసింది. జిల్లాలోని ప్రైవేటు డయాగ్నస్టిక్స్ సెంటర్లలో చేస్తున్న లింగనిర్ధారణ పరీక్షలకు ఈ సంభాషణ అద్దం పడుతోంది.

- చెన్నేకొత్తపల్లి మండలం కనుముక్కలకు చెందిన నాగార్జున వారం రోజులుగా దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతూ.. ధర్మవరంలోని ఓ ప్రైవేటు క్లినిక్‌కు వెళ్లారు. వైద్యుడి సలహా మేరకు రక్త, మూత్ర పరీక్షలు చేయించుకున్నాడు. ల్యాబ్ రిపోర్టులో డెంగీ పాజిటివ్‌గా నిర్ధరణ అయ్యింది. అనుమానంతో మరుసటి రోజే మరో ఆస్పత్రికి వెళ్లి టెస్టులు చేయించుకోగా.. సాధారణ జ్వరంగా తేలింది.

...ఇలా జిల్లాలోని పలు ల్యాబ్‌లు...డయాగ్నస్టిక్ సెంటర్ల నిర్వాహకులు లేని రోగాలను జనాలకు అంటగడుతున్నారు. కాసులకోసం ఇష్టానుసారం రిపోర్టులు ఇస్తున్నాయి. ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న ల్యాబ్‌లలో అయితే పరీక్ష రాస్తే పాజిటివ్ ఫలితం వస్తోంది.



ల్యాబ్‌లో రక్తనమూనా సేకరిస్తున్న దృశ్యం

వ్యాపార కేంద్రాలుగా ప్రైవేటు ల్యాబ్‌లు

- అనుమతి లేకుండా విచ్చల విడిగా ఏర్పాటు
- నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు
- కనీస జాగ్రత్తలు పాటించకుండా నమూనాల సేకరణ
- నిపుణులు లేకుండానే పరీక్షలు.. ఫలితాల్లో తేడాలు
- రోగులు.. వైద్యులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు

సాక్షి, పుట్టపర్తి నాడి పట్టుకుని జబ్బు కనుక్కునే వైద్యులు ప్రస్తుతం కరువయ్యారు. జ్వరం, జలుబు, దగ్గు నుంచి ప్రాణాంతక వ్యాధుల వరకూ అన్నింటికీ పరీక్షలే. రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌లు ఇచ్చే రిపోర్టు ఆధారంగానే వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలోనే కొన్ని ల్యాబ్ సెంటర్ల నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నారు. అనుమతులు లేకుండా సెంటర్ నడపడంతో పాటు అవగాహన లేకుండానే రిపోర్టులు ఇచ్చేస్తున్నరు. దీంతో ఇటు వైద్యులు.. అటు రోగులకు తలనొప్పిగా మారింది. ఇందులో కొందరు నమూనాలను సరిగా పరీక్షించకుండా రిపోర్టులు జారీ చేస్తుండగా.. మరికొందరు జబ్బు తీవ్రతను మించి జారీ చేస్తుండటం గమనార్హం. ఫలితంగా ఆయా రిపోర్టులను చూసి రోగులకు మందులు రాసిస్తున్న వైద్యులు కూడా నివ్వెరపోతున్నారు.

నిర్లక్ష్యం నీడలో నిఘా

ఆయా డయాగ్నస్టిక్ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి.. టెక్నీషియన్ల అర్హతలు, బాధితుల నుంచి నమూనాలు సేకరిస్తున్న తీరు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, రిపోర్టుల జారీ వంటి అంశాలను పరిశీలించాల్సిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో అనుమతి లేని రోగ నిర్ధారణ కేంద్రాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అనుమతి పొందిన ఆస్పత్రులు, క్లినిక్‌లు మొత్తం 198 ఉన్నాయి. అయితే హిందూపురం, ధర్మవరం, కదిరి, మడకశిర, పుట్టపర్తి తదితర కేంద్రాల్లో అనుమతులు లేకుండా సుమారు 126 ప్రైవేటు క్లినిక్‌లు యథేచ్ఛగా నడుస్తున్నాయి. వీటికి అనుబంధంగా నడిచే ల్యాబ్‌లు కూడా వందల్లోనే ఉన్నాయి.

రెన్యువల్స్ చేయించకుండా..

వ్యాధి నిర్ధారణ చేసే ల్యాబ్, డయాగ్నస్టిక్ ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. నిర్ణీత గడువులోపు వీటిని రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలోని ఏర్పాటు చేసిన ల్యాబ్‌లు అప్పుడెప్పుడో అనుమతులు తీసుకుని ఆ పత్రాలతోనే ఏళ్లకు ఏళ్లు నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. రెన్యూవల్‌కు వెళితే అధికారులు వచ్చి తనిఖీ చేస్తారని, అప్పుడు అనుమతులు లభించవన్న కారణంతో ఇలా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

అర్హతలు మరిచి..

ప్రైవేటు ఆస్పత్రుల్లో పని చేసే టెక్నీషియన్లు, ల్యాబ్ నిర్వాహకులు చాలా మంది అర్హత లేనివారే. తక్కువ జీతం ఇస్తూ నెట్టుకొస్తున్నారు. అలాంటి సిబ్బంది చేసే నిర్వాకంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. తెలిసీ తెలియని విధంగా పరీక్షలకు సంబంధించి రిపోర్టులు రాస్తారు. ఫలితంగా ఆ రిపోర్టు ఆధారంగా రోగులకు డాక్టర్ మందులు (ఔషధాలు) రాసిస్తారు. అనంతరం రోగులకు కొత్త అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ఫలితంగా అదే డాక్టర్ వద్దకు వెళ్లినా.. గుర్తించలేని పరిస్థితి ఏర్పడింది.

గుట్టుగా స్కానింగ్

కడుపులోని బిడ్డ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు డాక్టర్లు స్కానింగ్ చేస్తారు. అయితే దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు గుట్టు చప్పుడు కాకుండా లింగ నిర్ధారణ చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా 'కోడ్' భాషను వినియోగిస్తున్నట్లు తెలిసింది. ఆడబిడ్డ అయితే శుక్రవారం, మగబిడ్డ అయితే సోమవారం అని చెబుతున్నట్లు సమాచారం. అంతేకాకుండా డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండానే కొందరు స్కానింగ్ చేస్తున్నారు. దళారుల ద్వారా కొన్ని ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు భారీ దందాకు పాల్పడుతున్నాయి.

జిల్లాలో వివిధ రకాల పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లు, క్లినిక్‌లు ఇలా..

సోలో క్లినిక్‌లు	31
సోలో క్లినిక్ / ల్యాబ్స్	11
పాలీ క్లినిక్‌లు	15
పాలీ క్లినిక్ / ల్యాబ్	09
నర్సింగ్ హోమ్ ఆస్పత్రులు	92
బేసిక్ ల్యాబ్స్	29
హై-ఎండ్ ల్యాబ్స్	03
డెంటల్ క్లినిక్‌లు	06
ఫిజియోథెరపీ క్లినిక్‌లు	02
మొత్తం	198

కఠిన చర్యలు తీసుకుంటాం

జిల్లాలో నడిపే ల్యాబ్, డయాగ్నస్టిక్ సెంటర్లకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలి. అనధికారికంగా ఎవరైనా ల్యాబ్‌లు, స్కాన్ సెంటర్లు నిర్వహిస్తే తొలిసారి నోటీసులు పంపించి తర్వాత చట్టపరమైన చర్యలకు సిఫారసు చేస్తాం. అంతేకాకుండా అలాంటి కేంద్రాలను సీజ్ చేస్తాం.

– ఫైరోజాబేగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

ఫ్యాక్షన్‌కు 'కూటమి' ఊపిరిపోస్తోంది

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్



మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: కూటమి ప్రభుత్వం ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఫ్యాక్షన్ కు ఊపిరిపోస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ మండిపడ్డారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాప్తాడు నియోజక వర్గం కనగానపల్లి మండలం గుంతపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చాకలి నరసింహులుపై జరిగిన దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కోసం పనిచేశాడన్న కారణంతోనే నరసింహులును టార్గెట్ చేశారన్నారు. ఈ నేపథ్యంలోనే వ్యక్తి గత పనుల నిమిత్తం పక్క ఊరికి వెళ్లిన నరసింహులును ఒంటరిని చేసి వేట కొడవళ్లతో దాడి చేసి గాయపరిచారన్నారు. ఇది ముమ్మాటికీ దుర్మార్గమైన చర్య అన్నారు. దీనిపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఉషశ్రీచరణ్ డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పరిటాల కుటుంబం అనాగరికమైన ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహించడం మానుకోవాలని హితవు పలికారు. లేకపోతే ప్రజలే తిరగబడి తరిమే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్న విషయం గుర్తించాలన్నారు.

అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ జనరంజక పాలన సాగించారని, తద్వారా ఫ్యాక్షన్ రూపుమాపారని ఉషశ్రీచరణ్ గుర్తు చేశారు. అందువల్లే గతంలో ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాలుగా ముద్రపడిన గ్రామాల్లోనూ శాంతి కుసుమాలు పూశాయన్నారు. ప్రజలంతా కక్షలు కార్పణ్యాలు పక్కన పెట్టి శాంతియుతంగా జీవించారన్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందజేయడంతో వాటిని సద్వినియోగం చుసుకుని ఆ కుటుంబాలు కూడా ఆర్థికంగా స్థిరపడ్డాయన్నారు. ఆయా కుటుంబాల్లోని పిల్లలు కూడా ఉన్నత చదువులు చదివి మంచి సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడుపుతున్నారన్నారు. కానీ నేడు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమానికి పాతర వేసిందన్నారు. వైఎస్సార్ సీపీలో చురుగ్గా పనిచేసే కార్యకర్తను లక్ష్యంగా చేసుకుని భౌతిక దాడులు చేస్తూ గ్రామాల్లో ఫ్యాక్షన్ కు తెరతీస్తోందన్నారు. ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, చర్యకు ప్రతి చర్య తప్పక ఉంటుందని హెచ్చరించారు.

హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

- పరిటాల డైరెక్షన్‌లోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై హత్యాయత్నం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్



ఆస్పత్రిలో బాధితుడు చాకలి నరసింహులును పరామర్శిస్తున్న గోరంట్ల మాధవ్

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్లమాధవ్ మండిపడ్డారు. కనగానపల్లి మండలం గుంతపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త చాకలి నరసింహులుపై హత్యాయత్నం చేయడం దారుణమని మండిపడ్డారు. అనంతపురం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు చాకలి నరసింహులును ఆదివారం సాయంత్రం గోరంట్ల మాధవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చాకలి నరసింహులు క్రియాశీలకంగా ఉండేవాడన్నారు. పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ డైరెక్షన్‌లోనే ఈ దాడి జరిగిందని ఆరోపించారు. ఇలాంటి హత్యా రాజకీయాలను మొదలుపెడితే పరిటాల కుటుంబంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు రాప్తాడు నియోజకవర్గంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉండేవని గుర్తు చేశారు. ప్రశాంతతను చెడగొట్టేలా పరిటాల కుటుంబం వ్యవహరిస్తోందన్నారు. ఇలాంటి ఘటనలను ప్రోత్సహిస్తే మీకు పుట్టగతులుండవని, ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. అధికారం ఇచ్చిన ప్రజలకు మేలు చేయాలి గానీ, ఇలా దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హత్యా రాజకీయాలను ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు నాగముని, ధనుంజయయాదవ్, అమర్‌నాథ్‌రెడ్డి, గుంతపల్లి ఆనందరెడ్డి, మోహన్‌బాబు, సోమశేఖర్‌రెడ్డి ఉన్నారు.

పెనుకొండ కోట అద్భుతం



జ్ఞాపికను బహూకరిస్తున్న పట్టణ వాసులు

పెనుకొండ: శ్రీకృష్ణదేవరాయల రాజరిక వైభవానికి తార్కాణంగా నిలుస్తోన్న పెనుకొండ కోట అద్భుతంగా ఉందని కేరళ ట్రావెన్‌కోర్ రాజ వంశీకురాలు, పద్మశ్రీ పురస్కార గ్రహీత గౌరీ లక్ష్మీబాయి అన్నారు. ఆదివారం ఆమె పట్టణంలోని పలు పురాతన కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెనుకొండ రాజరికపు వైభవానికి ఈ కట్టడాలే నిదర్శనమన్నారు. ఈ చారిత్రక కట్టడాలను చూస్తే అలనాటి వైభవం ఎలా ఉండేదో తెలుస్తోందన్నారు. దక్షిణ భారతదేశంలోనే ఒక వెలుగు వెలిగిన విజయనగర సామ్రాజ్యంలోని ఆలయాలు, కోటగోడలు ఇతర కట్టడాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయన్నారు. అనంతరం గోరంట్లలోని ఊరు వాకిలి కోట గోడలు, అక్కడున్న శిలా శాసనాలను ఆమె పరిశీలించారు. చరిత్రకారుడు మైనాస్వామి అక్కడున్న శాసనాలను చదివి గౌరీలక్ష్మీబాయికి వివరించారు. అనంతరం ఆమె ఐముక్తేశ్వరాలయం, రామభద్రాలయం, కాశీ విశ్వేశ్వరాలయం తదితర ఆలయాలను సందర్శించారు. కాశీ విశ్వేశ్వర ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ రంగనాథరెడ్డి తదితరులు గౌరీ లక్ష్మీబాయికి జ్ఞాపికను బహూకరించారు.

గరుడవాహనా గోవిందా...



బ్రహ్మోత్సవాల సందర్భంగా విశేష అలంకరణలో పేట వేంకటరమణస్వామి మూలవిరాట్



గరుడవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణస్వామి

హిందూపురం: పేట వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత పేట వేంకటరమణస్వామి గరుడ వాహనంపై దర్శనమిచ్చారు. స్వరలంకారభూషితుడై దేవేరులతో కలిసి ఊరేగిన శ్రీవారిని చూసి భక్తులంతా గోవిందనామ స్మరణతో కీర్తించారు. అంతకుమందు ఉదయం అర్చకులు సుప్రభాత సేవతో వేంకటరమణస్వామికి పంచామృభిషేకాలు నిర్వహించారు. మూలవిరాట్‌కు బంగారు కవచాలు అలంకరించి అర్చనలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు ప్రాకారోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి మేళతాళాలతో పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రమణీయం.. రథోత్సవం

- వైభవంగా కోడిరంగనాథ స్వామి రథోత్సవం
- పురవీధుల గుండా ఊరేగిన స్వామివారు



ఆలయంలో వెలసిన కోడిరంగనాథస్వామి



శిరివరం కోడిరంగనాథస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

లేపాక్షి: మేళతాళాలు, కోలాటాలు, వీరభద్రుని వేషధారణలో కళాకారుల విన్యాసాలు..అందరి నోటా గోవింద నామస్మరణే. అందరి మదిలోనూ రంగనాథుడే. మండలంలోని శిరివరం గ్రామంలో వెలిసిన కోడిరంగనాథస్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం పలు హోమాలు నిర్వహించారు. అదేవిధంగా రథానికీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామపెద్దలు సమక్షంలో స్వామి వారిని పల్లకీలో రథం వరకు తీసుకువచ్చి కొలువుదీర్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. భారీగా విచ్చేసిన భక్తులతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు రథం లాగేందుకు పోటీపడ్డారు. రంగనాథస్వామి గోవిందా... గోవిందా అంటూ స్వామిని కీర్తించారు. దీంతో శిరివరంలో స్వామివారి నామస్మరణ మార్మోగింది. గ్రామస్తులే కాకుండా మానేపల్లి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, కర్ణాటక ప్రాంతం నుంచి విచ్చేసిన భక్తులు అరటి పండ్లు, ధవనం స్వామి రథంపై విసిరి మొక్కు చెల్లించుకున్నారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన రథోత్సవం 2 గంటల వరకు కొనసాగింది. ఉత్సవంలో సర్పంచ్ నేత్రావతి, ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

క్లుప్తంగా

మొబైల్ షాపులో అగ్నిప్రమాదం


మంటలు ఆర్పుతున్న దృశ్యం

కదిరి టౌన్: స్థానిక వలీసాహెబ్ రోడ్డులో ఉన్న మొబైల్ షాపులో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు... కదిరికి చెందిన నూర్ మహమ్మద్ ఓ మొబైల్ షాపు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం మొబైల్ షాపు నుంచి పొగలు వస్తుండడం గమనించిన స్థానికులు అప్రమత్తం చేయడంతో యజమానితో పాటు అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ లోపు షాపులో ఉన్న ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్, స్టిక్కర్ మిషన్, మొబైళ్లు కాలి బూడిదయ్యాయి. వీటి విలువ దాదాపు రూ.15 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. వీఆర్‌ఓ ఇనాయతుల్లా పరిశీలించారు. నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

పెనుకొండ: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండలోని మారుతీనగర్‌కు చెందిన ఆంజనేయులు(40) ఇటీవల నూతనంగా గృహ నిర్మాణాన్ని చేపట్టాడు. ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేసి, ఆర్థికంగా ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. ఈ నేపథ్యంలోనే కుటుంబంలో సమస్యలు సైతం పెరిగిపోయాయి. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన నూతనంగా తాను నిర్మాణం చేపట్టిన ఇంట్లోనే ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య


ప్రకాష్ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన ప్రకాష్ (40) ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయ కూలిగా కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆయనకు భార్య సాయిలత, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు విషయాన్ని గమనించి, వెంటనే బంధువుల సాయంతో ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, ప్రకాష్ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అంధత్వాన్ని జయించి.. క్రికెట్‌లో రాణించి

- ఆంధ్ర జట్టు తరఫున జాతీయ స్థాయి క్రికెట్‌లో రాణిస్తున్న నల్లమాడ యువకుడు



ఆంధ్ర జట్టు సభ్యులతో గణేష్ (కుడివైపు కింద కూర్చొన్న యువకుడు)


ఇండస్‌ఇండ్ బ్యాంక్ ట్రోఫీతో క్రికెటర్ గణేష్

నల్లమాడ: కృషి, పట్టుదల ఉంటే అంధత్వం అడ్డురాదని నిరూపించాడు నల్లమాడ మండలం గంగాపురం గ్రామానికి చెందిన గణేష్. పుట్టుకతోనే పాక్షిక అంధత్వంతో బాధపడుతున్నా.. పట్టుదలతో చదువు, క్రీడల్లో రాణించాడు. జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో ఏపీ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తూ తన ప్రతిభను చాటుకున్నాడు.

బెంగళూరులో ఉద్యోగం

గంగాపురం గ్రామానికి చెందిన సరస్వతి, ప్రభాకర్ దంపతులు వ్యవసాయ కూలీలు. వీరి రెండో కుమారుడు గణేష్ తన చదువులు మొత్తం బ్రెయిలీ లిపిలోనే కొనసాగించడం విశేషం. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కదిరి సమీపంలోని మొటుకుపల్లి ఆర్డీటీ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నాడు. పదో తరగతి వరకు అనంతపురం శివారున ఉన్న ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో, ఇంటర్‌ను తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలలో, డిగ్రీని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో, పీజీని ఎస్వీ యూనివర్సిటీలో పూర్తి చేశాడు. ప్రస్తుతం బెంగుళూరులోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో సీఎస్‌ఏ (కస్టమర్ సర్వీస్ అసోషియేట్)గా పనిచేస్తున్నాడు.

క్రికెట్ అంటే అమితాసక్తి

చిరుప్రాయం నుంచి క్రికెట్ అంటే గణేష్‌కు అమితాసక్తి. ఐదో తరగతి చదువుతున్నప్పుడు క్రికెట్‌లో ఓనమాలు నేర్చుకున్నాడు. ఈ క్రమంలో పాఠశాల స్థాయి, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. 2012లో జరిగిన అంధుల క్రికెట్ మ్యాచ్‌లో బీ2 (30 శాతం కంటిచూపు ఉన్నవారు) క్రీడాకారుడిగా తిరుపతి జట్టు తరఫున ఆడి ప్రాబబుల్స్‌కు, అనంతరం ఆంధ్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఫాస్ట్ బౌలింగ్‌లో ప్రత్యేకతను చాటుకుంటూ ఆల్‌రౌండర్‌గా తన ప్రతిభను నిరూపించుకున్నాడు. ఇప్పటి వరకు పలు మ్యాచ్‌లో పాల్గొని వందల సంఖ్యలో వికెట్లు తీయడమే కాక, అదే స్థాయిలో పరుగులూ సాధించాడు. వరుసగా మూడు రంజీ ట్రోఫీలు గెలిచిన ఆంధ్ర అంధుల క్రికెట్ జట్టులో గణేష్ కీలకంగా మారాడు. తాజాగా ఈ నెల 2 నుంచి 7వ తేదీ వరకు బెంగుళూరులో జరిగిన ఇండస్‌ఇండ్ బ్యాంక్ నగేష్ ట్రోఫీ అంధుల క్రికెట్ టీ20లో విజేత అయిన ఆంధ్ర జట్టులోనూ విశేష ప్రతిభ కనబరిచాడు. ఇండియా జట్టుకు ఆడాలన్నదే తన లక్ష్యమని గణేష్ తెలిపాడు. క్రీడాకారుడిగా తన ఎదుగుదలకు తిరుపతిలోని గట్ల క్రికెట్ క్లబ్ నిర్వాహకుడు గట్ల శ్రీనివాస రెడ్డి సహాయ, సహకారాలే కారణమని ఈ సందర్భంగా గణేష్ పేర్కొంటున్నాడు.

ఆంధ్ర జట్టు తరఫున ఆడి సాధించిన విజయాలు

- 2018 చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో జట్టును గెలిపించడంలో కీలకంగా మారాడు.
- 2018లో కోల్‌కత్తాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచి బంగారు పతకం అందుకున్నాడు.
- 2019, 2020లో కేరళలో జరిగిన జాతీయ స్థాయి నగేష్ ట్రోఫీలోనూ జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించాడు.
- 2021లో ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి క్రికెట్ పోటీలో ఆంధ్ర జట్టును విజయతీరాలకు చేర్చాడు.

రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీ విజేత దుర్గాప్రసాద్


విజేత ట్రోఫీని అందుకుంటున్న దుర్గాప్రసాద్

ధర్మవరం అర్బన్: స్థానిక కొత్తపేటలో రెండు రోజులుగా సాగుతున్న 7వ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నీ ఆదివారం ముగిసింది. సీనియర్ చెస్ క్రీడాకారుడు జాకీర్‌హుసేన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నీలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన 270 మంది క్రీడాకారులు తలపడగా... విజేత ట్రోఫీని ధర్మవరానికి చెందిన దుర్గాప్రసాద్ దక్కించుకున్నాడు. ద్వితీయ స్థానాన్ని ఆఫ్రిద్ ఖాన్, తృతీయ స్థానం భరత్‌భూషణ్ నిలిచారు. విజేతలకు ట్రోఫీలతో పాటు నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. ప్రతిభ చాటిన మరో 35 మందికి నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో రైల్వే సీఐ బి.కుమార, ఏపీ స్టేట్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి సుమన్, ఉషోదయ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ చాంద్‌బాషా, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, ఉపాధ్యక్షుడు సుంకు సుకుమార్, కార్యదర్శి జయరాం, ట్రెజరర్ వంకదారి మోహన్, టోర్నీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీవీ సుబ్బారావు, సభ్యులు పోలా ప్రభాకర్, వైకే శ్రీనివాసులు, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు .

కొడికొండలో గుప్త నిధుల వేట


కొడికొండ పాత చెరువు తూము వద్ద తవ్వకాలు జరిపిన దృశ్యం

చిలమత్తూరు (హిందూపురం అర్బన్): చిలమత్తూరు మండలం కొడికొండలో శనివారం రాత్రి కొందరు దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు సాగించారు. కోట వద్ద, పాత చెరువు తూము వద్ద తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు వెలుగు చూశాయి. కర్ణాటక నుంచి ఓ ముఠా వచ్చి గుప్త నిధుల కోసం తవ్వకాలు సాగించినట్లు సమాచారం. ఇందుకు స్థానికంగా కొందరు సహకరించినట్లుగా వదంతులున్నాయి. రాజులు ఏలిన ప్రాంతం కావడం... పురాతన ఆలయాలు ఉండటంతో గతంలో పెద్ద ఎత్తున గుప్త నిధులు వెలికి తీసి, గుట్టు చప్పుడు కాకుండా అపహరించారు. అప్పటి నుంచి అప్పుడప్పుడు ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. శనివారం రాత్రి పాత తూము వద్ద గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతుండగా అటుగా స్థానికులు వెళ్లడంతో దుండగులు పరారైనట్లుగా తెలుస్తోంది.

మున్సిపల్ కమిషనర్ పేరుతో ఫేక్ కాల్

- ఆన్‌లైన్‌లో ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలంటూ ఎర

పుట్టపర్తి టౌన్: స్థానిక మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద్ పేరుతో దుండగుడు ఓ డాక్టర్‌కు ఎరవేశాడు. ఆన్‌లైన్ ద్వారా ట్రేడ్‌లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలని ఎర వేశాడు. ఈ ఫోన్‌కాల్ స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే..పట్టణంలో సత్యసాయి క్లినిక్ నడుపుతున్న డాక్టర్ గోపాల్‌రెడ్డికి ఆదివారం ఉదయం 6300805117 నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద్ నంటూ పరిచయం చేసుకున్నాడు. ట్రేడ్ లైసెన్స్ జనవరి 31తో ముగిసిందని, ఆన్‌లైన్ ద్వారా రెన్యూవల్ చేసుకోవాలని సలహా ఇచ్చాడు. అయితే అప్పటికే డాక్టర్ గోపాల్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్‌తో పరిచయం ఉండటంతో ఆ వాయిస్ కమిషనర్‌ది కాదని గుర్తించారు. తాను ఎలాంటి ట్రేడ్ లైసెన్స్ దరఖాస్తు చేసుకోలేదని, పైగా తనకు కమిషనర్ తెలుసని చెప్పడంతో దుండగుడు ఫోన్‌కాల్ కట్ చేశాడు. వెంటనే గోపాల్‌రెడ్డి కమిషనర్ ప్రహ్లాద్‌కు ఫోన్ చేసి విషయం తెలిపారు. దీంతో కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ కమిషనర్ పేరుతో ఫేక్ కాల్స్ వస్తే జాగ్రత్తగా ఉండాలని, అలాంటి ఫేక్ కాల్స్ వస్తే రికార్డు చేసి 9515133115 నంబర్‌కు పంపాలని పట్టణ వాసులకు సూచించారు.

ప్రేమ పేరుతో వేధింపులు.. యువతి ఆత్మహత్య


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలి తల్లిదండ్రులు

రాప్తాడు రూరల్: తనను ప్రేమించాలంటూ ఓ యువకుడి వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లికి చెందిన దళిత కడప రామచంద్ర, వీరమ్మ దంపతులు స్థానిక ఓ ఇటుకల బట్టీల కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రెండో కుమార్తె కడప శిరీష (21) డిగ్రీ చదువుకునే సమయంలో ఉప్పరపల్లికి చెందిన పిన్నదరి వంశీ ప్రేమ పేరుతో వెంటపడేవాడు. శిరీష వారించినా వినేవాడు కాదు. దీంతో తల్లిదండ్రులకు బాధితురాలు తెలపడంతో వారు వంశీని హెచ్చరించారు. అదే సమయంలో విషయాన్ని వంశీ తల్లిదండ్రుల దృష్టికీ తీసుకెళ్లారు. అయినా వంశీలో మార్పు రాలేదు. ప్రేమించాలంటూ వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో తీవ్ర మనస్థాపం చెందిన శిరీష... ఆదివారం ఉదయం ఆరు బయట నాన్నమ్మ వంట చేస్తుండగా ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. 12.30 గంటల సమయంలో ఇంటికి వచ్చిన శిరీష సోదరుడు గమనించి వెంటనే తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని శిరీషను కిందికి దించి పరిశీలించారు. అప్పటికే ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న ఇటుకలపల్లి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. వంశీ కారణంగానే శిరీష మృతి చెందిందంటూ బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారి వెంట ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి నాయకులు రామకృష్ణ, మారెప్ప, ఓబుళపతి, సూరి, స్వామి ఉన్నారు.

ఏపీ జట్టు జూడో కోచ్‌గా చిగిచెర్ల పీడీ ప్రతాపరెడ్డి


జూడో అసోసియేషన్ ప్రతినిధులతో పీడీ ప్రతాపరెడ్డి

ధర్మవరం రూరల్: జాతీయ స్థాయి జూడో పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టుకు కోచ్‌గా చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ ప్రతాపరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఏపీ జూడో అసోసియేషన్ అధ్యక్షుడు ఆనం రామకిషోర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగే 38వ జాతీయ క్రీడా పోటీల్లోల ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టుకు ఆయన కోచ్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

శాశ్వత బదిలీల చట్టం డ్రాఫ్ట్‌ను బహిర్గతం చేయాలి

- బడుల మూసివేతను అడ్డుకుని తీరుతాం
- ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు


మాట్లాడుతున్న హృదయరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు సంబంధించి కొత్తగా తీసుకురానున్న శాశ్వత బదిలీల చట్టానికి సంబంధించిన డ్రాఫ్ట్‌ను బహిర్గతం చేయాలని ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, ఐఫియా చీఫ్ ప్యాట్రన్ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఏపీటీఎఫ్ (1938) జిల్లాస్థాయి ఉద్యమ శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన హృదయరాజు, సుబ్బారెడ్డి మాట్లాడారు. జీఓ 117ను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొస్తామంటూ ఎన్నికలకు ముందు చెప్పిన కూటమి పెద్దలు... అధికారంలోకి వచ్చిన తర్వాత మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు పేరుతో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను నిర్వీర్యం చేసే కుట్రకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగాన్ని విచ్చిన్నం చేసేదిశగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోందన్నారు. 20 శాతం పాఠశాలలు ఆదర్శ పాఠశాలలుగా మారితే మిగిలిన 80 శాతం పాఠశాలలు అనాథ పాఠశాలలుగా మారతాయన్నారు. బడుల మూసివేతను అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. కిలోమీటరు పరిధిలో ప్రాథమిక పాఠశాల, మూడు కిలోమీటర్ల పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాల, ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాల విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమాంతర మాధ్యమాలు, మైనర్ మాధ్యమాలను పునరుద్ధరించాలన్నారు. ప్లస్‌టూ పాఠశాలలను కొనసాగిస్తూ పీజీటీల నియామకం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీటీఎల్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న, ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధానకార్యదర్శి కె.కులశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసనాయక్, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, రవీంద్ర, సత్యప్రసాద్, పోతలయ్య, ఆంజనేయులునాయక్, అశోక్ నాయక్ పాల్గొన్నారు.

అశ్వత్థం.. భక్తజన సందోహం


దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో సింగరభట్లు, గణపతి, అశ్వత్థనారాయణస్వామి విగ్రహాలు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రానికి రెండవ ఆదివారం భారీగా భక్తులు తరలివచ్చారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వందలాది మంది భక్తులకు జేసీ ట్రస్ట్‌తో పాటు ధర్మవరానికి చెందిన యల్లపు సోమశేఖర్, వసుంధర దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీపీ గార్లదిన్నె బీసీ రామకృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు. డాక్టర్ ఉషారాణి, హెల్త్ సూపర్‌వైజర్ శర్మాష్ వలి పర్యవేక్షణలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, సామాజిక సేవాసంస్థల సభ్యులు శంకర్, పి.నారాయణ, గురప్ప, రామాంజినేయులు, పాండురంగ తదితరులు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

హనుమద్ వాహనంపై రంగనాథుడు


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నాల్గో రోజు దేవేరులతో కలసి హనుమద్ వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. జమ్మిచెట్టు వరకూ ఊరేగించి అనంతరం ఆలయంలో కొలువు దీర్చారు. కాగా, ఆదివారం వేకువజాము నుంచి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్యక్రమాలను ఆలయ ఈఓ రామాంజనేయులు పర్యవేక్షించారు.

జూదరుల అరెస్ట్

ధర్మవరం అర్బన్: స్థానిక గూడ్స్ షెడ్ కొట్టాలలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి, రూ.27320 నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. అందిన సమాచారం మేరకు ఆదివారం ఉదయం గూడ్స్ షెడ్ కొట్టాల ప్రాంతంలో రెండో పట్టణ పోలీసులు తనిఖీలు చేపట్టారన్నారు. ఈ సమయంలో పట్టుబడిన ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామన్నారు. జూదరులను న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పేర్కొన్నారు.

యుద్ధ కళ కోచ్‌లూ.. దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి: జిల్లాలోని ప్రభుత్వ, కేజీబీవీ, ఆదర్శ, మున్సిపల్, సంక్షేమ, గిరిజన పాఠశాలల్లో రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష పరిశీలన–ఆత్మరక్షణ కార్యక్రమం అమలు చేయనున్నారు. ఈ మేరకు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. కార్యక్రమం అమలులో భాగంగా మొత్తం 20 విభాగాల్లో తైక్వాండో వంటి స్వీయ రక్షణ, యుద్ధ కళల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి ఉన్న, రిజిస్టర్ అయిన సొసైటీ, ట్రస్ట్ నిర్వాహకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. దరఖాస్తులను సోమవారం సాయంత్రం 5 గంటల్లోపు బుక్కపట్నంలో ఉన్న సమగ్ర శిక్ష కార్యాలయంలో అందించాలి. పూర్తి వివరాలకు 99859 72599లో సంప్రదించవచ్చు.

వృథాగా పోతున్న నీరు


కాలువ నుంచి వృథాగా పోతున్న నీరు

ముదిగుబ్బ: యోగి వేమన రిజర్వాయర్ కుడి కాలువకు మూడు రోజుల క్రితం రైతుల ఒత్తిళ్ల మేరకు అధికారులు విడుదల చేసి నీరు వృథాగా పోతోంది. దెబ్బ తిన్న కాలువలకు కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేయకపోవడమే ఇందుకు కారణమని రైతులు ఆరోపించారు. ప్రాజెక్ట్ సమీపంలో మూడు చోట్ల నీరంతా వృధాగా పోతోందని, అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌టీపీఏ మండల అధ్యక్షుడి మృతి


సునీల్‌కుమార్ (ఫైల్)

తలుపుల: మండలంలోని సిద్దుగూరిపల్లికి చెందిన ఉపాధ్యాయుడు, వైఎస్సార్‌టీపీఏ మండల అధ్యక్షుడు సి.సునీల్‌కుమార్ (37) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య నందిని, కుమార్తె లాస్య, కుమారుడు ఆనంద్ ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌టీపీఏ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, ఉపాధ్యాయులు గంగాధర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు సునీల్‌కుమార్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన బెనిఫిట్స్‌ను సకాలంలో మంజూరయ్యేలా చొరవ తీసుకుంటామన్నారు.

170 చీనీ చెట్ల దగ్ధం


కాలిపోయిన చీనీ తోటను చూపుతున్న రైతు లక్ష్మీనారాయణరెడ్డి

ధర్మవరం రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో ధర్మవరం మండలం తిప్పేపల్లికి చెందిన రైతు లక్ష్మీనారాయణరెడ్డి సాగు చేసిన చీనీ తోట దగ్ధమైంది. ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. తోటకు సమీపంలో ఉన్న ఎండు గడ్డికి ఆకతాయిలు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి మూడేళ్ల వయసున్న 170 చీనీ చెట్లు, డ్రిప్పు పరికరాలు కాలిపోయినట్లు బాధిత రైతు తెలిపాడు.

వక్కతోటకు నిప్పు

రొళ్ల: మండలంలోని టీడీ పల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో మంటలు చెలరేగి రైతు చంద్రబాబు సాగు చేసిన వక్కచెట్లు, డ్రిప్ పరికరాలు కాలిపోయాయి. తనకు 4.5 ఎకరాల పొలం ఉండగా 2 ఎకరాల్లో రెండేళ్ల క్రితం వక్క మొక్కలు నాటాడు. ఈ పొలానికి అనుకుని రిజర్వు ఫారెస్ట్ ఉంది. ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు రిజర్వు ఫారెస్ట్‌కు నిప్పు పెట్టడంతో రైతు చంద్రబాబు వక్కతోటను మంటలు చుట్టుముట్టాయి. గుర్తించిన స్థానిక రైతులు వెంటనే మంటలు అదుపు చేసే లోపు 25 వక్క చెట్లు, 50 మీటర్ల డ్రిప్ పైపు కాలి బూడిదయ్యాయి. ఘటనతో రూ.15 వేల మేర నష్టం జరిగినట్లు బాధిత రైతు తెలిపాడు. అలాగే దాసప్పపాళ్యం గ్రామంలోనూ రైతు నాగరాజుకు చెందిన 70 వక్క చెట్లతో పాటు డ్రిప్పు పరికరాలు దగ్ధమయ్యాయి. ఘటనతో రూ. 50 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.